క్లుప్తంగా

కమిటీ ఎన్నిక


సదానందం, అధ్యక్షుడు

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ కార్మిక సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సంకటి సదానందం, ఉపాధ్యక్షుడిగా మట్టెవాడ రాజు, ప్రధాన కార్యదర్శిగా జంపయ్య, కోశాధికారిగా మంథెన రాధాకృష్ణ, కార్యదర్శులుగా అంతడ్పుల సతీష్, రాజబాబు, గౌరవ అధ్యక్షులుగా అంతడ్పుల సమ్మయ్య, బండారి బాబు, నన్నపు ప్రకాశ్, ఓరుగంటి రాజేందర్, పొనపాకల సమ్మక్క, ముఖ్య సలహాదారులుగా నగావత్ దేవేందర్, శీలపాక నర్సయ్య, అల్లూరి మంజులను ఎన్నుకున్నారు. అనంతరం సంఘానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ కార్మిక సంఘంగా నామకరణం చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు తాగునీరు అందజేత

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు ఎక్సెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సెల్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండాల శంకర్ మాట్లాడుతూ.. పరీక్షలు జరిగే ఆరు రోజుల పాటు ఎక్సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తాగు నీటిని అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కటంగూర్ మనోహర్‌రెడ్డి, వేముల శ్రీకాంత్ ఉన్నారు.

ఏఎమ్మార్ ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం



మల్హర్: మండలంలోని అడువాలపల్లిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షల సందర్భంగా ఏఎమ్మార్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా బస్సును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం 10కిలోమీటర్ల దూరం ఉండడంతో సంస్థ సీఎస్ఆర్‌లో భాగంగా సామాజిక సేవాకార్యక్రమాలలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. పరీక్షలు ముగిసే వరకు బస్సును నడిపించనున్నారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుజాత, కంపెనీ ప్రతినిధులు నరేష్, రాహుల్ ఉన్నారు.

శిఖం భూమి ఆక్రమిస్తే చర్యలు

కాటారం: చెరువు శిఖం భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీఓ ఉపేంద్రయ్య అన్నారు. కాటారం చెరువు శిఖం ఆనుకొని నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఎంపీఓ సోమవారం పరిశీలించారు. శిఖం భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని అన్నారు. ఎంపీఓ వెంట పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొర్లకుంట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి వోల్వోజుల సత్యనారాయణ(55) అనే వ్యక్తి 5 రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై కాటారం వస్తున్న క్రమంలో కాటారం మండలం పోతులవాయి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు నలుగురు కూతుర్లు ఉన్నారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామానికి చెందిన గండు దేవేందర్ వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయి సోమవారం అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చిట్యాల సివిల్ ఆస్పత్రి వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పరామర్శించారు. జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఎంపీపీ యారసుజాత సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రచారం నిలిపేయాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ప్రచారం విద్యాశాఖ అధికారులు నిలిపేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ పాఠశాల సిబ్బంది పట్టణంలో అడ్మిషన్ల కొరకు ప్రచారం నిర్వహిస్తుండగా సోమవారం అడ్డుకున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల ప్రవేశాల కోసం గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

పలిమెల: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణపక్షం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేయించారు. అలాగే మండలంలోని బూరుగుడ్డెంలో అంగన్‌వాడీ టీచర్ శివమ్మ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, సత్యవతి, కిష్టబాయి, సమ్మక్క, భారతి, శారద, కవిత ఉన్నారు.

మహాముత్తారం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ లింగమల్ల శారద, ఎంపీడీఓ పెద్ది అంజనేయులు అన్నారు. పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో అంగన్‌వాడి కార్యకర్తలు బాలింతలకు, గర్భిణీలకు పోషకాహారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వరూపా, రాజేశ్వరి, స్వప్న, రాద, అరుణ, పద్మ, బానుమతి, శామల ఉన్నారు.

మహదేవపూర్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ రాణిబాయి, ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ శ్రీపతిబాపు అధ్యక్షతన పోషణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార వంటలు, ఆహార పదార్థాలపై ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ, కేదారి గీత, ఓడేటి స్వప్న, పాల్గొన్నారు.


టేకుమట్ల: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన

టేకుమట్ల: చిరుధాన్యాలతో ఆరోగ్యం సొంతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో పోషణ పక్వాడా ముగింపులో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగునంగా తినే ఆహారంలో పోషక విలువలను పెంచుతూ ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను వినియోగిస్తే సంపూర్ణ ఆరోగ్యం మనసొంతమన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు తప్పనిసరిగా తినే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిట్యాల: చిరుధాన్యాల వంటలతో ఎంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. మండలంలోని నైన్‌పాక సెక్టార్ జడలపేట గ్రామంలో పోషన్ పక్వాడా కార్యాక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు చిరుధాన్యాల వంటకాలతో పోషకాహారలోపం నియంత్రించవచ్చని అన్నారు. అనంతరం సర్పంచ్ కామిడి రత్నాకర్ రెడ్డి, ఎంపీటీసీ సమ్మిరెడ్డి, ఈఈ రజిత, ఉమా, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద పాల్గొన్నారు.

కాటారం: చిరుధాన్యాలు ప్రతి రోజు తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కాటారం మండలం దేవరాంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిరుధాన్యాల పౌష్టికమేళా నిర్వహించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ, పోషణ ప్రతిజ్ఞ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, అంగన్‌వాడీ ఆయాలు రజిత, తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పోషకాహారంతో రక్తహీనత దూరం చేయవచ్చునని ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సర్పంచ్ మోటే ధర్మారవు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి పోషణ్ పక్ష వారోత్సవాలను అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అవంతి, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, మండల వైద్యాధికారిణి డాక్టర్ నాగరాణి, ఏఓ సురేందర్ రెడ్డి, సూపర్‌వైజర్లు మాధవి, రజిత, అంగన్‌వాడీ టీచర్లు వెన్నెల, లావణ్య, శ్రీమత, అనిత, జ్యోతి, స్వరూప పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి, పలుగుల, అన్నారం గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమతం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దీప్తి, శైలజ, ఉమామహేశ్వరి, శ్రీలత, స్వరూప, రమాదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.


కాటారం: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


మహాముత్తారం: అన్నప్రాసన చేస్తున్న ఎంపీడీఓ


కాళేశ్వరంలో..


చిట్యాల: అవగాహన కల్పిస్తున్న జయప్రద

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య


భూపాలపల్లి రూరల్: దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో శైలజ

మహదేవపూర్: భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య అని పలువురు కొనియాడారు. దొడ్డి కొమురయ్య జయంతిని మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణంలో సోమవారం నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి యాదవ సంఘం నాయకుడు కాట్రేవుల లచ్చయ్య పూలమాల వేసి నివాళులలర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, బాపు, సమ్మయ్య, ఐలయ్య, అశోక్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు తుడిచర్ల దుర్గయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: సామాజిక ఉద్యమకారుడు బహుజన పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గొల్ల, కుర్మ, యాదవ సంఘం జిల్లా నాయకుడు చేపూరి ఓదెలు హాజరై కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అశోక్, కర్నాటకపు సమ్మయ్య, కార్యాలయం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పలిమెల: ముకునూర్ గ్రామ పంచాయతీ ఇటీవల రాష్ట్ర స్థాయిలో సామాజిక భద్రత విభాగంలో మూడవ స్థానంలో నిలిచి బహుమతి గెలిచిన సందర్భంగా సర్పంచ్ ఆలం సత్యనారాయణను తుడుందెబ్బ యువజన నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. యూత్ నాయకులు మడే సత్యనారాయణ, మట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'కంటి వెలుగు'

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదలకు వరమని ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఇస్సిపేట, పిడిసిల్ల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ఆయా గ్రామల సర్పంచ్‌లు కోడారి సునీత, నైనకంటి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ గొర్రె సాగర్ సోమవారం ప్రారంభించారు. కంటి సమస్య ఉన్న ప్రతీ ఒక్కరికి కంటివెలుగు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఏపీఎం మంజుల, మెడికల్ ఆఫీసర్ మహేశ్వరి, సర్పంచ్ పూర్ణచందర్రావు, కోఆప్షన్ సభ్యులు రాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: పిడిసిల్లలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కాటారం: మండలంలోని దామెరకుంటలో కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ప్రజాప్రతినిధులు, వైద్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటివెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కంటి సంబంధిత వ్యాధులు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని రెఫర్ చేయనున్నట్లు కంటి వైద్యులు డాక్టర్ లింగమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ చంద్రశేఖర్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై కుట్రపూరిత చర్యలు

మహదేవపూర్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ కుట్రపూరిత చర్యలు చేపడుతున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రవెల్లి విలాస్‌రావు, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు ఆరోపించారు. మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు ఆయన నివసిస్తున్న బంగ్లాను స్వాధీనం చేసుకుంటామని నోటీసులు పంపించడం బీజేపీ దుర్మార్గానికి నిదర్శణమన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మండల రాహుల్, మండలాల అధ్యక్షులు చీమల సందీప్, దండెర రాజేందర్, ఎరుకల ప్రవీణ్, గడ్డం క్రాంతి, శివకుమార్, కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విలాస్‌రావు

అధికారుల సూచనలు పాటించాలి

కాటారం: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ పేర్కొన్నారు. పంటల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సోమవారం కాటారంలోని పలువురు రైతులకు సంబంధించిన వరి పొలాలను ఏఓ పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువ ఉన్నట్లు గుర్తించి నివారణ కోసం రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వరి చిరుపొట్ట దశలో కాండం తొలుచు పురుగు ఆశిస్తే తెల్లకంకులు ఏర్పడుతాయని గింజలు పాలు పోసుకోకుండా తాలుగా మారుతాయని ఏఓ రైతులకు వివరించారు. కాండం తొలిచే పురుగు నివారణ కోసం రైతులు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ, 400 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60మిల్లీలీటర్లు లేదా టెట్రానిలిప్రోల్ 80 మిల్లీలీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని ఏఓ తెలిపారు.


రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 29 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామని బీజేపీ ప్రభుత్వం స్పందించి వెంటనే వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్ పేర్కొన్నారు. ఈ మేరకు భూపాలపల్లి నుంచి మంజూనగర్ బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విజయ్ మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని అనేక సభల్లో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని పూర్తిగా పక్కకు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ, మండల నాయకుడు సిలివేరు పవన్, పట్టణ కన్వీనర్ దోర్నాల భరత్, రవితేజ, గణపతి, చింతకుంట్ల కుమార్, అంబాల వెంకటేష్, ప్రతాప్, శ్రీకాంత్ మొలుగురి రవీందర్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

కాటారం: మండలంలో సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్, గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు మూడు కేంద్రాల్లో 598 మంది విద్యార్థులకు 597 మంది తెలుగు పరీక్ష రాసినట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్‌రావు పరిశీలించారు.

మహాముత్తారం: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 151మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 149మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షకేంద్రాన్ని తహసీల్దార్ మాధవి, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎస్సై సుధాకర్ సందర్శించినట్లు పరీక్షకేంద్రం ఇన్‌చార్జ్ సమ్మయ్య తెలిపారు.

టేకుమట్ల/రేగొండ: పదో తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా సోమవారం టేకుమట్ల పరీక్ష కేంద్రంలో 150కి 150 మంది విద్యార్థులు, రేగొండ, రంగయ్యపల్లి సెంటర్‌లలో 384 మంది విద్యార్థులకు 384 మంది విద్యార్థులు హాజరైనట్లు టేకుమట్ల, రేగొండ మండల విద్యాధికారులు కోడెపాక రఘుపతి, వేల్పుల ప్రభాకర్ తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


చిట్యాల: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలో మొట్లపల్లి, మొగుళ్లపల్లిలో గ్రామాల్లోని పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 261 మంది విద్యార్థులకు వంద శాతం హాజరైనట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎస్సై శ్రీధర్ సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

మహదేవపూర్: మండలంలో పదోతరగతి పరీక్షలు సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష సెంటర్‌లలో సోమవారం 449 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పరీక్ష జరగగా తహసీల్దార్ శంకర్, మండల విద్యాధికారి దేవా నాయక్, ఎస్సై రాజకుమార్, పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామని ఎంఈఓ వెల్లడించారు.చిట్యాల: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 160మంది విద్యార్థులకు 160 మంది హాజరయ్యారు. బాలికల గురుకుల పాఠశాలలో 180 మందికి 179 మంది హాజరైనట్లు ఎంఈఓ కోడెపాక రఘుపతి తెలిపారు. పరీక్ష కేంద్రల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.


రేగొండలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు


మహదేవపూర్‌లో..


కాటారం: పరీక్షకు హాజరైన విద్యార్థులు

నర్సరీ పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ

మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీసీఈఓ రఘువరణ్ సోమవారం పరిశీలించారు. మొక్కల పెరుగుదలను పరిశీలించి నర్సరీలో మొక్కల పెంపుదల బాగుందని పంచాయతీ కార్యదర్శిని, సర్పంచ్, పంచాయతీ సిబ్బందిని అభినందించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళలో వనసేవక్‌లు మొక్కలకు తగినంత నీటిని పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శి ఇందిరా తదితరులు ఉన్నారు.

కనకమ్మ ఆశయ సాధనకు కృషి

టేకుమట్ల(రేగొండ): కామ్రేడ్‌పంచగిరి కనుకమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. సోమవారం రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లిలో కనుకమ్మ సంతాప సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కనుకమ్మ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలని, జీవితాంతం సీపీఐలో కొనసాగుతూ ఈ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ ఆమె కుమారులు సైతం కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యమకారుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని నవ సమాజ నిర్మాణానికి నాంది పలుకాలని సూచించారు. మండల అధ్యక్షుడు పెంట రవి, జిల్లా సహాయ కార్యదర్శి శాంతికుమార్, నాయకులు సాంబయ్య, చంద్రమౌళి, రాజేందర్, ఆగయ్య, రవీందర్, వీరస్వామి పాల్గొన్నారు.


కనుకమ్మ సంతాప సభలో సీపీఐ నాయకులు

రేపు జగ్జీవన్‌రామ్ జయంతి

భూపాలపల్లి రూరల్: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను బుధవారం జిల్లాకేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌస్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి సునీత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


టైలరింగ్ షాప్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

మహదేవపూర్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ షాప్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టైలరింగ్ వృత్తి గొప్ప జీవనోపాధి మార్గంగా మహిళలు మలుచుకోవడం మంచి ఆలోచన అన్నారు. కుటుంబ పెద్దకు మహిళలు ఆర్థికంగా నిలిస్తే ఆ కుటుంబాలు మరింత బలపడుతాయని అన్నారు. మహిళలపై నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ అందించే పనులు వెలుగు సంఘం అధికారుల కృషితో అప్పగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.